

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


# నమస్తే తెలంగాణ

## భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, శుక్రవారం 8 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM





- బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- ఖమ్మం నగరంలో పార్టీ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశం

## ఖమ్మం పార్లమెంటరీ స్థానంలో

# గులాబీదే విజయం

ఖమ్మం, మార్చి 7 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం స్థానాన్ని బీఆర్ఎస్సే కైవసం చేసుకుంటుందని బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షతన గురువారం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన పార్టీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారనే నమ్మకం ఉందన్నారు. జిల్లా ప్రజలు తనను రెండుసార్లు ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపారని, వారిపై ప్రేమతో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపానన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాను లోక్‌సభలో గొంతెత్తానన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తిరిగి సాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఖమ్మం జిల్లాకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, కానీ ఆయనకు మాత్రం పార్టీ ఏమీ ఇవ్వలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నామా నాగేశ్వరరావును గెలిపించుకుని కేసీఆర్‌కు కానుక ఇద్దామన్నారు. నామాకు అత్యంత ప్రజాదరణ ఉందన్నారు. ఆయన సత్తా ఉన్న నాయకుడని కొనియాడారు. ఢిల్లీలో ఆయన నాయకత్వంలో బీఆర్ఎస్ ఎంపీలందరూ ముందుకు సాగుతున్నారన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యమ నేతగా కేసీఆర్ ప్రాణాలు ఒడ్డి తెలంగాణ సాధించారన్నారు. అనంతరం ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో




ఖమ్మం పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా. చిత్రంలో రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, మాజీ మంత్రి అజయ్, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు

నంబర్‌వన్ చేశారని కొనియాడారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను కష్టాలు పాలు చేయడం ప్రారంభించిందని మండిపడ్డారు. రైతుబంధు గురించి ముగ్గురు మంత్రులు మూడు విధాలుగా మాట్లాడుతున్నారన్నారు. మూడెకరాలు దాటిన రైతులకు ఇప్పటివరకు రైతుబంధు అందలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు, కేసులు నమోదు చేయడం మానుకోవాలని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో నామా గెలుపు అత్యంత ఆవశ్యకమన్నారు. కార్యకర్తలందరూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. నిజాయితీకి, నిబద్ధతకు నిలువటద్దం నామా నాగేశ్వరరావు అని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆయన్ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నామాకు అత్యధిక మెజార్టీ ఓట్లు వచ్చేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నెలకొన్న సమస్యలపై నామా లోక్‌సభలో ప్రస్తావించారని గుర్తు చేశారు. నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్, మంత్రిగా కేటీఆర్ ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో నామాను గెలిపించుకుని, ఆ గెలుపును బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. నామా గెలుపుతో జిల్లా రాజకీయాల్లో పెను మార్పులు రావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేద్దామన్నారు. మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కష్ట కాలంలో కార్యకర్తలకు అండగా ఉండే నామాకు అండగా నిలుద్దామని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన్ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత నగరంలోని అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళి అర్పించారు. అనంతరం గులాబీ శ్రేణులు పట్టణంలో ద్విచక్రవాహనాలు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించాయి. తొలుత పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎమ్మెల్యే లాస్య నందితను స్మరిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. బీఆర్ఎస్ ఉద్యమకారుడు బొమ్మెర రామ్మూర్తిని వేదికపై ఆహ్వానించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, బానోతు మదన్‌లాల్, తాటి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు కొండబాల కోటేశ్వరరావు, చంద్రావతి, కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, మొండితోక జయకర్, ఖమర్, షౌకత్ ఆలీ, బిచ్చాల తిరుమలరావు, పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ, ఉప్పల వెంకటరమణ, డోకుపర్తి సుబ్బారావు, మహేశ్, చింతనిప్పు కృష్ణచైతన్య, మాటేటి కిరణ్, జోగేశ్వరరావు, నాగమణి, కోనేరు చిన్ని, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# శివ పూజకు వేళాయె..

> మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైన శివాలయాలు
> ఉమ్మడి జిల్లాలో మార్మోగనున్న శివనామ స్మరణ
> ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాల నిర్వాహకులు

మహా శివరాత్రి ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాలోని శైవాలయాలన్నీ ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాల కాంతులతో ఆలయ గోపురాలు, ప్రాంగణాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. పండుగ శోభను సంతరించుకున్న దేవాలయాలు శివనామ స్మరణ చేస్తున్నాయి. కూసుమంచిలోని కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయం, తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయం, పెనుబల్లి మండలం భవన్నపాలెంలోని నీలాద్రీశ్వరుడి ఆలయం, వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం రామలింగేశ్వరస్వామి దేవాలయం, మోతే పట్టీనగర్‌లోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం, మధిరలోని మున్నేరు నది ఒడ్డున ఉన్న శ్రీమృత్యుంజయస్వామి ఆలయం, ఖమ్మం కాల్వొడ్డులోని గుంటుమల్లేశ్వరస్వామి ఆలయం, అన్నపురెడ్డిపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం, జూలూరుపాడు మండలం పాపకొల్లులోని కాకతీయుల కాలం నాటి ఉమా సోమలింగేశ్వరస్వామి ఆలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ పెరుగనున్న నేపథ్యంలో ఆలయాల నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సౌకర్యం కల్పించారు. పోలీసులు ట్రాఫిక్ నిబంధనలు అమలు చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు.

–నమస్తే నెట్‌వర్క్






- 'వద్దిరాజు'ను రెండోసారి పదవి కట్టబెట్టడం హర్షణీయం
- ఎంపీ నామా నాగేశ్వరరావు
- ఖమ్మంలో కేసీఆర్ కృతజ్ఞత, వద్దిరాజు రవిచంద్ర అభినందన సభ
- బీఆర్ఎస్‌ను గెలిపించుకుందాం: వద్దిరాజు
- కేసీఆర్ ప్రభుత్వంలోనే బీసీలకు పెద్దపీట: మాజీ మంత్రి పువ్వాడ

# బీసీలను ఎదగనిచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే



వద్దిరాజును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



సభా వేదికపై అభివాదం చేస్తున్న ఎంపీలు నామా, వద్దిరాజు, మాజీ మంత్రి అజయ్, ఎమ్మెల్సీ తాతా, మాజీ ఎమ్మెల్యేలు



కృతజ్ఞత సభకు హాజరైన ప్రజలు

ఖమ్మం, మార్చి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీసీలను ఎదగనిచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. కేసీఆర్ బీసీలకు అండదండలు అందించారని, దీనిలో భాగంగానే వద్దిరాజు రవిచంద్రకు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారన్నారు. ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్డు గాయత్రి మైదానంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన కేసీఆర్ కృతజ్ఞత, వద్దిరాజు రవిచంద్ర అభినందన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాధన కోసం బీఆర్ఎస్ కొట్లాడిందని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమ నేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రాన్ని సంక్షేమ రాజ్యంగా తీర్చిదిద్దారన్నారు. జలాలను తరలించి బంజరు భూములను మాగాణిగా మార్చారన్నారు. అభివృద్ధిని పరుగులు పెట్టించి సంస్కరణలకు నాంది పలికారన్నారు. బీసీల పక్షపాతిగా వారి కోసం సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వద్దిరాజు రవిచంద్రకు ఇచ్చిన మాట ప్రకారం రెండోసారి రాజ్యసభ సభ్యుడి పదవిని కట్టబెట్టారన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం బీసీలకు ఎంతో ప్రాధాన్యమిచ్చిందన్నారు. బీసీలకు నామినేటెడ్ పదవులనూ కట్టబెట్టిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల పదవులనూ గుంజుకున్నదని మండిపడ్డారు. బీసీలు రాజకీయంగా ఎదుగుతున్నారనే అక్కసుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ నేతలకు బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించడమే కాదు.. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉండి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికలో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ.. బీసీల ఆత్మబంధువు కేసీఆర్‌కు బీసీలు అండగా నిలివాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, హరిప్రియానాయక్, తాటి వెంకటేశ్వర్లు, వనమా వెంకటేశ్వరరావు, మదన్‌లాల్, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, ముఖ్య నాయకులు జూలూరి గౌరీశంకర్, డాక్టర్ ప్రకాశ్, కొండబాల కోటేశ్వరరావు, దూదిమెట్ల బాలరాజు, తాడూరి శ్రీనివాసరావు, ఆంజనేయులు, దిండిగాల రాజేందర్, వెంకటేశం, తిరుమలరావు, మానవతారాయ్, రాజారాం యాదవ్ పాల్గొన్నారు.

### గులాబీ జెండానే బీసీలకు అండ..



గులాబీ జెండానే బీసీలకు అండ. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. అత్యంత వెనుకబడిన 13 కులాలను బీసీల జాబితాలో చేర్చారు. బీసీ పిల్లల కోసం గురుకులాలు ఏర్పాటు చేశారు. బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు రుణాలు ఇచ్చారు. బీసీ యువతలో నైపుణ్యాలు పెంచి ఉపాధి కల్పించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బీసీలను పదవుల నుంచి తొలగిస్తున్నది. వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నది. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీసీలంతా ఒక్కటై బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

– రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

## రాములోరి నిత్య కల్యాణం

భద్రాచలం, మార్చి7: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున స్వామివారికి అర్చకులు సుప్రభాత సేవ, ఆరగింపు సేవలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణ వేడుక నిర్వహించారు. దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

































- తండ్రి మరణంతో బయటికొచ్చి హ్యాండిల్ పట్టిన ముస్లిం యువతి
- అద్దె ఆటో నడుపుతూ కుటుంబ పోషణ.. ఇద్దరు చెల్లెళ్లకు వివాహాలు..
- కిరాయి లభిస్తే ఎంత దూర ప్రాంతానికైనా ఒంటరిగానే ఆటో డ్రైవింగ్..
- సంప్రదాయాలు, కట్టుబాట్లను దాటి పూట గడవడం కోసం పోరాటం..
- మహిళా దినోత్సవ ప్రత్యేక కథనం

# ఆటో లేడీ.. ఆసియా బేగం



ఆటో నడుపుతున్న ఆసియాబేగం (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 7 (నమస్తే తెలంగాణ):'ఆటో వాలా' అంటూ పురుషులను సంబోధిస్తుంటాం. కానీ ఇక్కడ 'ఆటో వాలీ' అని కాకుండా 'ఆటో లేడీ' అని సంబోధించుకోవాలి. అవసరమైతే శారీరక శ్రమ కూడా చేయాల్సి ఉన్న ఆటో వృత్తి పురుషులకే కాస్త కష్టమైనదిగా ఉంటుంది. ఏదైనా కారణంతో ఆటో ఆగిపోతే కనీసం వారు దానిని కొద్దిదూరం బలంగా నెట్టుకొని అయినా స్టార్ట్ చేసుకోగలరు. కానీ మహిళలకు అది కొంచెం కష్టమే. కానీ దానికి కూడా సిద్ధమయ్యే ఆమె ఆటో హ్యాండిల్ పట్టుకుంది. గేర్లు మార్చుకుంటూ ముందుకు సాగేందుకు నడుంబిగించింది. అందుకు దారి తీసిన పరిస్థితులే ఆమెను ఆటో లేడీగా మార్చాయి.

కొత్తగూడేనికి చెందిన యాకూబ్ పట్టణంలో చిన్న హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. అతడికి ఐదుగురు కుమార్తెలు. ఒక కుమారుడు. భార్య గృహిణి. ఈ క్రమంలో అనారోగ్య కారణాలతో 2016లో అతడు ఆకస్మికంగా మరణించాడు. దీంతో ఆ కుటుంబం పరిస్థితి ఒక్కసారిగా రోడ్డున పడినట్లయింది. కానీ పెద్ద కుమార్తెగా ఉన్న ఆసియాబేగం మాత్రం తన తండ్రి ఇక లేనందున ఇప్పటి నుంచి తన కుటుంబ పరిస్థితి ఏమిటన్న ఆలోచనలో పడింది. కుంగుబాటు నుంచి కాస్త కూడదీసుకొని మనసు దిటవు చేసుకుంది. తన కుటుంబానికి తానే పెద్ద దిక్కుననుకుంది. తన తండ్రి బాధ్యతను తన బాధ్యతగా తీసుకొని దానిని భుజానికెత్తుకుంది. అప్పటికే తన ఇద్దరు చెల్లెళ్లకు తన తండ్రి వివాహం జరిపించాడు. ఇక మిగిలిన మరో ఇద్దరు చెల్లెళ్ల వివాహాల బాధ్యత తానే తీసుకుంటాననుకుంది. అప్పటి వరకూ ఇంట్లో చేస్తున్న టైలరింగ్ వృత్తితో కుటుంబ పోషణ సాధ్యం కాదని భావించింది. అప్పటికప్పుడు ఆదాయం సమకూరే మరికొంత ఆసరాగా నిలిచే మరో వృత్తిని ఎంచుకోవాలనుకుంది. ఈ క్రమంలోనే ఆమె దృష్టి ఆటోపై పడింది. పట్టుదలతో ఆటో నేర్చుకుంది. సోదరుడు కూడా హైదరాబాద్ వెళ్లి ప్రైవేటు పనులు చేస్తున్నాడు.

### ఎంతదూరమైనా ఒంటరిగానే డ్రైవింగ్..

సంప్రదాయాలు, కట్టుబాట్లను దాటి ఆమె బయటకు వచ్చింది. ఆటోను అద్దెకు తీసుకొని తోలడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో కిరాయి లభిస్తే ఎంత దూరమైనా ఒంటరిగానే డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో కొత్తగూడెం నుంచి మణుగూరు, ఆపైన మంగపేట వంటి ప్రాంతాలకు కూడా వెళ్లి వస్తుంటుంది. నాలుగేళ్ల ఈ ప్రయాణంలో తాను కూడా మరో ఇద్దరు చెల్లెళ్ల వివాహాలు జరిపించింది. ఈమె సాహసాన్ని గమనించిన గత కలెక్టర్ అనుదీప్ నిరుడు మహిళా దినోత్సవం రోజున ఆసియాబేగాన్ని సన్మానించారు.